క్లుప్తంగా

ఉపాధి హామీ బహిరంగసభ వాయిదా

తంబళ్లపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ అంజనప్ప తెలిపారు. బహిరంగ సభకు శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుల అనుమతి రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. సభ నిర్వహణ తేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె తిలక్‌వీధికి చెందిన ఓ యువతి(19) ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న అంగడికి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లింది. తిరిగి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడ విచారించారు. యువతి కనపడకపోవడంతో పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం రాత్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లల చదువు ఇంటికి వెలుగు

మదనపల్లె సిటీ : పిల్లల చదువు ఇంటికి వెలుగు అని ఫోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్రై,ఫోర్డు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో షి లర్న్–షి లీడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. పురుషులతో పాటు ఆడ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలికల విద్యలో భాగంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పెద్దమండ్యం : పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువుల కట్ట వద్ద పెద్దమండ్యం–గాలివీడు రహదారి ప్రక్కనే అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. రెండు రోజుల పాటు విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా జరిపించారు. శుక్రవారం సూర్యోదయాత్పూర్వం యంత్రస్థాపన, నవరత్న స్థాపన, శిలా విగ్రహ స్థాపన, జప పారాయణాదులు, దీక్షా హోమము, తత్వహోమము, ప్రతిష్ఠాహోమము, సాంతిస్థాపన హోమము, బలిహరణము, నేత్రోన్మలనము, కూష్మాండబలి, దర్పణ,ధేను దర్శనం నిర్వహించారు.

జారిపడి విద్యార్థికి గాయాలు

మదనపల్లె : జాతరకు వెళ్లి కొండ దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడి విద్యార్థి గాయపడిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం ఎస్టేట్‌కు చెందిన చంద్ర కుమారుడు జి.మంజునాథ(16) 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం బి.కొత్తకోట మండలం గట్టు గ్రామసమీపంలోని కొండపైన అక్కవారిజాతరకు వెళ్లాడు. దర్శనానంతరం కొండ దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

బైక్ అదుపుతప్పి..

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. నాయునిబావి పంచాయతీ తంగేవారిపల్లెకు చెందిన ఉత్తమ్‌రెడ్డి కుమారుడు లక్ష్మీరెడ్డి(30) వ్యక్తిగత పనులపై మొటుకుపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గ మధ్యంలో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆధారాలు సమర్పిస్తేనే ఓటు హక్కు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక సహకార పరపతి సంఘం (సొసైటీ) బ్యాంకుల్లో కంప్యూటరీకరణ జరుగుతోందని బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సొసైటీ బ్యాంకులో సభ్యత్వం ఉన్న రైతులందరూ పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్, రేషన్, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు రెండు ఫొటోలను బ్యాంకులో అందజేయాలన్నారు. లేని పక్షంలో డైరెక్టర్ ఎన్నికల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉండదని సీఈఓ స్పష్టం చేశారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ

రామసముద్రం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య నూతన మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు యూనియన్ జిల్లా కోశాధికారి వినయ్ తెలిపారు. మండల అధ్యక్షుడుగా చరిత, కార్యదర్శిగా ఇలాహి, కోశాధికారిగా వంశీ, ఉపాధ్యక్షులుగా నిరీష్,షానుజ, మణికంఠ, రాజేష్, సహాయ కార్యదర్శులుగా నీతుశ్రీ, కుమారి, ఆదర్శ, లాభాలు ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

కేజీబీవీని తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి

రామసముద్రం : మండలంలోని దిన్నిపల్లి సమీపంలో ఉన్న కస్తుర్బా పాఠశాలను శుక్రవారం పుంగనూరు జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి తనిఖీ చేశారు. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు కేజీబీవీలోని సమస్యలపై, బాలకల విద్యాభ్యాసంపై ఆరా తీశారు. పాఠశాల ప్రాంగణం, వంటగది తర గతి గదులు వాటర్ ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి


పీలేరు: పుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కలకడ: గోపాలపురంలో నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

పీలేరు రూరల్ : శ్రావణ మాసం మొదటి శుక్రవారంతోపాటు నాగుల పంచమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పుట్టకు పూజలు నిర్వహించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, తిరుపతి రోడ్డు పుట్టగడ్డ వద్ద మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. పుట్టకు, నవగ్రహాలకు ప్రదక్షణలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

నాగదేవత ప్రాణప్రతిష్ట

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నాగులపంచమి పురస్కరించుకుని నాగదేవత ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఉదయం హోమం, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు నాగదేవతల విగ్రహాలకు పాలు పోశారు. పిండి పదార్థాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్దనున్న పుట్టలో పాలు పోశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


రామసముద్రం : చెంబకూరులో నాగదేవతలకు పూజలు

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో శుక్రవారం ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నాగ పంచమి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వెనుక ఉన్న నాగదేవతల విగ్రహాలకు అర్చకులు శంకరశాస్త్రీ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతల విగ్రహాలకు పసుపు, కుంకుమ రాసి, పలురకాల పుష్పాలతో అలంకరించారు. మొక్కులు ఉన్న వారు నాగపడిగలు చేయించి సమర్పించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లె మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని నాగదేవతలకు పూజారి భాస్కర్ మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. మహిళలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి పుట్టలో పాలు పోసి నాగ సర్పదోష నివారణ పూజలు చేశారు.

కలకడలో..

కలకడ : మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నాగపంచమిని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉపవాస దీక్షతో పుట్టలు, నాగరాళ్ళ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టచుట్టూ దారం చుట్టి, ప్రదక్షణలు చేసి పుట్టలో పాలుపోశారు. నాగదేవతలకు పసుపు, కుంకుమ సమర్పించిన అనంతరం ఉపవాసదీక్షలు విరమించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

వాల్మీకిపురం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితమని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సంఖ్య పెరిగేలా గ్రామీణ ప్రాంతంలోని గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించాలని, గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చింతపర్తి పురవీధుల్లో పర్యటించి, మురికి కాలువలు లేనిచోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు జులేఖ బేగం, సనా అయేషా, వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, ముజీబ్, సుధాకర్, భానుభి, సురేష్, కరుణ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బి.కొత్తకోట : విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిస్కం ఏఈ గిరిబాబు తెలిపారు. బి.కొత్తకోట పట్టణం, కోటావూరు, నాయనబావి, బడికాయలపల్లె గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యపరీక్షలతో సురక్షిత మాతృత్వం

కలకడ : వైద్య పరీక్షలు చేయించుకోవడంతోనే సురక్షిత మాతృత్వం సాధ్యమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ లో నిర్వహించిన పీఎంఎస్‌యంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య రక్తపరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం సాధ్యమన్నారు. కడుపులోని శిశువు ఎదుగుదలకు, రక్తం పెంచుకోవడానికి, వ్యాధుల నిర్ధారణకు రక్తపరీక్షలు తప్పనిసరి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర రావు, రెడ్డెమ్మ, ఆరోగ్యసిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో మాతశిశు సంక్షేమం


పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : ఆరోగ్య పరీక్షలతో మాతశిశు సంక్షేమం సాధ్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ కాలంలో తల్లి అనారోగ్యం ప్రభావం, బిడ్డ ఆరోగ్యంపై చెడు ప్రభావం పడకుండా, ఆరోగ్య పరీక్షల ఆవశ్యకతను గర్భిణీలకు వివరించారు. చక్కెరవ్యాధి, అధిక రక్తపోటు, బరువు, పెరుగుదల, రక్తహీనత తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలతో చేయడంతోపాటు ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్సియం మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎస్ఎం ఫామున్నీసా, సీహెచ్‌వోలు లావణ్య, కుముదా తదితరులు పాల్గొన్నారు.

పీలేరు సీఐగా యుగంధర్



పీలేరు రూరల్ : పీలేరు అర్బన్ సీఐగా యుగంధర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న మోహన్‌రెడ్డి రాయచోటి వీఆర్‌కు బదిలీ అయ్యారు. వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో సీఐగా పని చేస్తున్న యుగంధర్ బదిలీపై పీలేరుకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ తమ ధ్యేయమన్నారు.

అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న జడ్జి గురుఅరవింద్

కలికిరి : చట్టపరమైన అక్షరాస్యతపై జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల్ లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ గురు అరవింద్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టపరమైన చర్యలకు దూరంగా ఉండేలా వ్యవహరించాలని, తోటి విద్యార్థుల పట్ల సోదర భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే అనర్థాలు, చట్టపరమైన కఠిన చర్యలను విద్యార్థులకు వివరించారు. అలాగే ఉచిత న్యాయ సేవల లభ్యతపై తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, లీగల్ ఏఐడీ కౌన్సిల్ న్యాయవాది ఎల్లారెడ్డి, ఏఎస్ఐ మహబూబ్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వీరిలో విద్యార్థి పరిస్థితి విషమించింది. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన వీరప్ప కుమారుడు పవన్(17) తల్లిదండ్రులు మృతిచెందడంతో అవ్వాతాతల వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో విద్యార్థి మద్యం తాగడం అలవాటుగా చేసుకోవడంతో గమనించిన అవ్వ శుక్రవారం మందలించింది. దీంతో మనస్తాపం చెందిన పవన్ ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడ్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దిగువభూంపల్లెకు చెందిన మల్లప్ప కుమారుడు శివశంకర్(24) కుటుంబసమస్యలతో భార్య వందనతో గొడవపడ్డాడు. మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్సలు పొందుతున్నారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం


ఆదివాసి దినోత్సవంలో వివిధ సంఘాల నాయకులు

పీలేరు : ఏపీ గిరిజన యానాది సేవా సంఘం (ఏపీజీవైఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీవైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవమంటే వేడుకలు మాత్రమే కాదని, ఆదివాసీల ప్రత్యేక సంప్రదాయాలు, భాషలు, గిరిజనుల జ్ఞాన వ్యవస్థలను పరీక్షించడం, సమాజ సాంస్కృతిక వైవిధ్యానికి ముఖ్యమైనవని వివరించారు. ఆదివాసీల సంప్రదాయ పద్ధతుల ద్వారా ప్రకృతిని కాపాడడంలో, సహజ వనరులను సంరక్షించడంలో ఆదివాసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చుక్కలపాటి ఆదినారాయణ, విజయకుమార్, ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, గట్టప్ప, వెంకటేష్, మహేష్‌యాదవ్, షాహిన్‌షా, బుజ్జు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాసులు

మదనపల్లె సిటీ : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సమష్టిగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి ప్రత్యేక సంప్రదాయాలు, జీవనవిధానానికి రక్షణ, ప్రచారం కోసం చేయాల్సిన విధులు వివరించారు. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జానం గంగిరెడ్డి, రెడ్డప్ప, కిల్లా విజయకుమార రాజేష్, నారాయణమ్మ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి షేక మహోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం : శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం అంకురార్పణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర నిత్య సేవలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం టీటీడీ వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీ కలశ స్థాపన, హోమాది కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, టీటీడీ అధికారులు, వేదపండితులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటకు రెండు బస్సు సర్వీసులు


రాజంపేట బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు డిపో నుంచి రాజంపేటకు రెండు నూతనంగా బస్సు సర్వీసులను శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎం కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డిపో నుంచి వయా సుండుపల్లె, సానిపాయి మీదుగా రెండు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ తెల్లవారి 5.45 గంటలకు పీలేరులో బయలుదేరి 9 గంటలకు రాజంపేట చేరుతుందన్నారు. అక్కడి నుంచి 9.30కి తిరిగి అక్కడ బయలుదేరి మధ్యాహ్నం 12.45కి పీలేరు చేరుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1.15 గంటలకు పీలేరులో బయలుదేరి 4.30 గంటలకు రాజంపేట చేరుతుందన్నారు. అక్కడి నుంచి 5.00కి తిరిగి అక్కడ బయలుదేరి రాత్రి 8.15కి పీలేరు చేరుతుందని తెలిపారు. మరో బస్సు ఉదయం 10.30 గంటలకు పీలేరులో బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేట చేరుతుందన్నారు. అక్కడి నుంచి 2.15కి తిరిగి అక్కడ బయలుదేరి సాయంత్రం 5.30కి పీలేరు చేరుతుందని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు పీలేరులో బయలుదేరి రాత్రి 9.15 గంటలకు రాజంపేట చేరుతుందన్నారు. అక్కడి నుంచి తెల్లవారి 5.15కి తిరిగి అక్కడ బయలుదేరి ఉదయం 8.30కి పీలేరు చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐ సుబ్బమ్మ, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రామ్మూర్తి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్


గుర్రంకొండ అటవీ ప్రాంతంలో జూదరులను అరెస్ట్ చేసిన పోలీసులు

గుర్రంకొండ : పన్నెండు మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.41,600 నగదు, 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గుర్రంకొండ మండలం టి.పసలవాండ్లపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కుమ్మరపల్లె అటవీ ప్రాంతంలో రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన జూదరులు పెద్ద ఎత్తున జోరుగా పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో ముగ్గురు కాపాలాదారులను కొండల్లో ఉంచి జూదం నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చిన్నమండ్యం, గుర్రంకొండ, పెద్దమండ్యం, గాలివీడు మండలాలకు చెందిన మొత్తం 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. వీరిపై కేసు నమోదుచేసి వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట : మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ గుండాలవారిపల్లె వద్ద పేకాట జూదమాడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై బొజ్జి నాయక్ శుక్రవారం తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,520 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విద్యుత్‌శాఖ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలి


విద్యుత్‌శాఖ ఈఈ గంగాధరంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ : ప్రజలకు అందుబాటులో ఉంటూ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని విద్యుత్‌శాఖ ఈఈ గంగాధరం అన్నారు. శుక్రవారం నూతనంగా ఎన్నికై న విద్యుత్ ఓసీ అసోసియేషన్ నాయకులు ఈఈ గంగాధరంను విద్యుత్‌శాఖ ఓసి అసోసియేషన్ కలిసి అభినందలు తెలియజేసి వినతిపత్రం అందజేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జి.రామలింగారెడ్డి, కార్యదర్శి శేషాద్రి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రెడ్డప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీనివాసులు ,డి.కుమార్, ఈసీ సభ్యులు ఎస్.రఘు, సలహాదారు వసంతరెడ్డి, కోశాధికారి శివమూర్తి, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, ఎం.రఘునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శులు కలాం బాషా, మనోహర్‌రెడ్డి, పబ్లిసిటీ కార్యదర్శిగా హెచ్‌వి సాయిప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు



ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మదనపల్లె : పట్టణంలో శుక్రవారం ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్ని తాకాయి. శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటంలో అమరులైన త్యాగశీలులను స్మరించుకుంటూ..వారి త్యాగఫలితమే నేడు భారతదేశం స్వతంత్ర్య దేశంగా అవతరించిందని..దేశపోరాటంలో అమరులైన పోరాటయోధులను తలచుకుంటూ వారిచేసిన కృషిని స్మరించుకున్నారు. కాలేజీలో జాతీయజెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలను పాడారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకబృందం కలిసి కాలేజ్ నుంచి కదిరిరోడ్డులోని సంగం ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లారు. మానవహారం నిర్వహించి దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, డైరెక్టర్.ఎస్.శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం శ్రీగెవితిమ్మరాయస్వామి

- భక్తుల కోర్కేలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి
- నేటి నుంచి వైభవంగా శ్రావణమాస పూజలు

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ దిన్నిపల్లె సమీపంలోని అడ్డకొండలో వెలసిన పురారన మహావిష్ణువు అవతార ఆలయం గెవితిమ్మరాయస్వామి ఆలయం. భక్తుల కోర్కేలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి. ఈ ఆలయం మండల కేంద్రానికి మూడు కీలోమీటర్ల దూరంలో అడ్డకొండలో ఉంది. ఈ కొండ సమశీతోష్ణ వాతావరణంలో ప్రకృతి అందాలతో సంచరించుకుని సముద్ర మట్టానికి 2507 అడుగుల ఎత్తులో ఉంది. కొండ గుహలోని ఒక గెవిలో ఉండటంతో ఈ ఆలయాన్ని గెవితిమ్మరాయస్వామి ఆలయమని పేరు. అయితే ఇక్కడ ధ్యానం చేయడం వలన ఈ కొండను ఋషులకొండ , ధ్యానచలం అని కూడా పిలుస్తారు. ఈ ఆలయంలో పద్మావతిదేవి అమ్మవారు , గణపతి, ఆంజనేయస్వామి వారి విగ్రహాలు ప్రతిష్టించారు. ఆలయం ముందు కోనేరు ఉంది. ఇందులోకి కొండలోని వనమూలికల వేర్లు నుంచి నీరు వచ్చి చేరడం వలన కోనేరు నీటిని భక్తులు పవిత్రంగా భావిస్తున్నారు. ఆలయానికి ఉత్తరాన 330 అడుగుల ఎత్తులో కొండ శిఖరంపై మేలుదీప స్తంభం ఉంది. ఆలయానికి తూర్పున ఒకసొరంగం ఉంది. ఇందులో దేవతలు ఉన్నారని నిత్యం సంగీత వాయిద్యాలు, చప్పుళ్లు వినిపించేవని సమాచారం. అంతేకాకుండా ఈ సొరంగం తిరుమల కొండ వరకు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఆలయం ముందుభాగాన టీటీడీ ఆస్థాన గాయకురాలు శోభారాజ్ పూర్వీకులు వీరంగమ్మ ఆలయం కూడా ఉంది.

శ్రావనమాసంలో వైభవంగా పూజలు :

ప్రతిఏటా శ్రావణమాసంలోని శనివారాలలో అత్యంత వైభవంగా పూజలు జరుగుతాయి. 3, 4 శనివారాలల్లో భక్తులు అన్నదానాలు చేస్తారు. ఆలయానికి శ్రావణ మాసంలో కర్నాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

ప్రతి పంచాయతీలో ఫాగింగ్

- గ్రామాభివృద్ధికి సెక్రటరీలు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలి
- విజువల్లీ క్లీన్డ్ పంచాయతీకి రూ.25వేల ప్రోత్సాహకం
- శిక్షణ కార్యక్రమంలో డీపీఓ ధనలక్ష్మి


పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

మదనపల్లె : స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి పంచాయతీలోనూ ఫాగింగ్ నిర్వహించి దోమల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో రెండోరోజైన శుక్రవారం డీపీఓ ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో సమస్యలు ఉండవన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందుకోసం పీఆర్–1 యాప్‌ను పరిచయం చేసిందన్నారు. దీనిలో ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తమ గ్రామంలోని సమస్యలను అప్‌లోడ్ చేసి, తర్వాత పరిష్కారానికి తీసుకున్న చర్యలను తెలపాలన్నారు. ప్రస్తుతం జరిగే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలైన క్లోరినేషన్, డ్రెయిన్ల క్లీనింగ్, గార్బేజ్ హీప్స్‌క్లియర్ మొదలైన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నిర్వహించి ఫోటోస్ అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యశాఖ సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రైడే సర్పంచులు అందరూ నిర్వహించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీలు అన్నీ పూర్తిగా ఫంక్షన్‌లోకి తీసుకురావాలన్నారు. వీధిదీపాలకు స్విచ్‌లు బిగిస్తే కరెంట్ బిల్లులు అధికంగా రాకుండా చేయవచ్చన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ఆదాయం, పలు వివరాలను కార్యదర్శులు తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ముఖ్యమైన పనులపై శ్రద్ధ వహించాలని కోరారు. విజువల్లీ క్లీన్డ్ పంచాయతీకి ప్రభుత్వం రూ.25వేలు ప్రోత్సాహకం ప్రకటించిందని, ప్రతి ఒక్కరూ తమ పంచాయతీలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్ది పురస్కారాన్ని పొందేందుకు అర్హత సాధించాలన్నారు. మదనపల్లె మండలాన్ని పరిశుభ్ర మండలంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా డీపీఓ ధనలక్ష్మిని, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, కొత్తవారిపల్లె సర్పంచ్ మహేష్, అంకిశెట్టిపల్లె శరత్‌రెడ్డి, పోతబోలు ఈశ్వరయ్య, బొమ్మనచెరువు కరుణాకర్‌రెడ్డి తదితరులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ నాగరాజ, ఎంపీడీఓ భానుప్రసాద్, ఈఓపీఆర్డీ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.